RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 88 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | మంగళవారం | 29.09.2026 | పేజీలు : 8

హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్ ఘాతుకం..

క్యాబ్ ఎక్కిన మహిళపై లైంగిక దాడికి యత్నం

- దిశ ఘటన జరిగిన ప్రాంతంలోనే మరో దారుణ ఘటన
- కారును నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి ప్రయత్నం
- రూ. 60 వేల నగదు ఉన్న బ్యాగుతో పరారైన నిందితుడు
- కేసు నమోదు చేసి, ప్రత్యేక బృందాలతో గాలిస్తున్న పోలీసులు

2

తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

- నాలుగేళ్ల నిరంతర విద్య నిబంధన తప్పనిసరి అని పునరుద్ఘాటన
- స్థానికతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- రాష్ట్రపతి ఉత్తర్వులను, తెలంగాణ జీవోను సమర్థించిన న్యాయస్థానం



2

ఎల్ నినో ఎఫెక్ట్: తెలంగాణలో భగ్గుమంటున్న ఎండలు

- తెలంగాణపై ఎల్ నినో ప్రభావం
- సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రతలు
- నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- రానున్న రెండు రోజుల్లో మరింత పెరగనున్న ఎండలు



2

ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ..

గెజిట్ విడుదల..?



- దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ
- అసెంబ్లీ నుంచి అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ
- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేయడమే కారణం
- ఉప ఎన్నికలో గెలుపుపై ధీమా వ్యక్తం చేసిన దానం నాగేందర్

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణలో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఖాళీ అయినట్లు అధికారిక ప్రకటన వెలువడింది. సిట్టింగ్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఈ స్థానాన్ని ఖాళీగా గుర్తిస్తూ తెలంగాణ శాసనసభ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. హైకోర్టు తీర్పును అనుసరించి, 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే ఆయన సభ్యత్వం రద్దయినట్లు ఈ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ విజయం సాధించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి,..... మిగతా 2వ పేజీ లో..

నార్త్ వర్సెస్ సౌత్ కాదు

గుజరాత్ వర్సెస్ దేశం

- సీఎం రేవంత్ రెడ్డి

- కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- ఇది నార్త్ వర్సెస్ సౌత్ కాదు, గుజరాత్ వర్సెస్ దేశం అని వ్యాఖ్య
- ఓటర్ల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ
- రాహుల్ గాంధీని కలిశాకే కాంగ్రెస్‌లో చేరానన్న రేవంత్
- తెలంగాణ అభివృద్ధికి మోదీ సర్కార్ సహకరించడం లేదని విమర్శ



నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రస్తుతం దేశంలో ఉత్తర, దక్షిణ భారత్ మధ్య కాకుండా, 'గుజరాత్ వర్సెస్ దేశం' అన్నట్లుగా పరిస్థితులు నెలకొన్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. అసోంకు చెందిన ఓ ప్రముఖ దినపత్రిక నిర్వహించిన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ..... మిగతా 2 వ పేజీ లో..

దేవుళ్లను కూడా విభజిస్తారా?

రేవంత్‌పై బండి సంజయ్ ఫైర్..

- రాముడు, శివుడి మధ్య రేవంత్ రెడ్డి రాజకీయ చిచ్చు పెడుతున్నారన్న బండి సంజయ్
- కులం, ప్రాంతం తర్వాత దేవుళ్లను కూడా విభజిస్తున్న కాంగ్రెస్ అని విమర్శ
- దక్షిణ కాశీ, దక్షిణ అయోధ్య ఉన్న రాష్ట్రంలో ఇలాంటి రాజకీయాలు సరికాదంటూ హితవు
- ప్రధాని మోదీ కాశీ విశ్వనాథుని భక్తుడని, వేముల వాడకు వచ్చారని గుర్తుచేశారు
- ఓట్ల కోసం దేవుళ్లను వాడుకుని, ఇప్పుడు విభజిస్తున్నారని తీవ్ర ఆరోపణ



నిత్యం నిఘా, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేవుళ్లను కూడా విభజించే నీచమైన ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. రాముడు, శివుడి మధ్య రాజకీయ విభజన రేఖలు గీస్తూ, ఉత్తర, దక్షిణ భారత దేవుళ్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. "కులాలు, ప్రాంతాల మధ్య .....

2

టీజీపీఎస్సీ కీలక ప్రకటన..

పలు ఉద్యోగ పరీక్షల షెడ్యూల్ విడుదల



- టీజీపీఎస్సీ పలు ఉద్యోగ పరీక్షల షెడ్యూల్ విడుదల
- అక్టోబర్, నవంబర్ నెలల్లో పరీక్షల నిర్వహణ
- అసిస్టెంట్ సైంటిస్ట్, ఏఈఈ, డీఈవో పోస్టులకు తేదీల ఖరారు
- కంప్యూటర్ ఆధారిత విధానంలో జరగనున్న పరీక్షలు

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణలోని నిరుద్యోగులకు కీలక సమాచారం. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పరీక్షల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. ఈ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. లక్షలాది మంది అభ్యర్థులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పలు కీలక పోస్టులకు సంబంధించిన పరీక్షల తేదీలను టీజీపీఎస్సీ ప్రకటించింది. విడుదల చేసిన .....

2

ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం మాములుగా ఉండదు

- దానం నాగేందర్

- ఖైరతాబాద్ ఉపఎన్నికలో నిర్ణయాత్మక ఫలితం వస్తుందని దానం జోస్యం
- ఈసీని వాడుకుని బీజేపీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని విమర్శ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్



2

హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..?

- హైదరాబాద్ మణికొండలో చెడ్డీ గ్యాంగ్ ప్రత్యక్షం
- అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడి మహిళపై దాడి
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ముఠా సభ్యుల వీడియోలు
- కేసు దర్యాప్తునకు మూడు ప్రత్యేక పోలీస్ బృందాల ఏర్పాటు
- సెక్యూరిటీ గార్డుల పాత్రపై ఆరా తీస్తున్న పోలీసులు



నిత్యం నిఘా, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో మరోసారి చెడ్డీ గ్యాంగ్ కలకలం రేపింది. మణికొండలోని ఒక అపార్ట్‌మెంట్‌లోకి చొరబడిన ఈ ముఠా సభ్యులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే, నిన్న తెల్లవారుజామున మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి చెడ్డీ గ్యాంగ్ సభ్యులు ప్రవేశించారు. నివాసంలోకి చొరబడి దొంగతనానికి పాల్పడుతుండగా, ఒక మహిళ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన దుండగులు ఆమెపై దాడి చేసి...

2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

నార్త్ వర్సెస్ సౌత్ కాదు
గుజరాత్ వర్సెస్ దేశం
- సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) టెండర్లకు కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అనుమతులు నిలిపివేసిందని మండిపడ్డారు. దేశం నిధులను గుజరాత్‌కు మాత్రమే తరలిస్తున్నారని, అందుకే ఇది గుజరాత్ వర్సెస్ దేశం అనే పోరాటంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో కేంద్ర ప్రభుత్వం పెద్ద కుట్రకు పాల్పడుతోందని రేవంత్ ఆరోపించారు. ఈ ప్రక్రియ ద్వారా పేదలు, ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను తొలగిస్తున్నారని, ఇప్పటికే దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని, భవిష్యత్తులో మరిన్ని ఓట్లు తొలగించే ప్రణాళికతో ఉన్నారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్ గో బ్యాక్' ఉద్యమం రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్‌ను కేంద్రం తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని దుయ్యబట్టారు. తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న రేవంత్ రెడ్డి, ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులపై రెండుసార్లు గెలిచానని, అయితే నాటి ప్రభుత్వంతో పోరాడేందుకు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీలో చేరానని తెలిపారు. 2014 తర్వాత తెలంగాణలో పోరాటం ప్రధానంగా కేసీఆర్‌కు, తనకు మధ్యనే జరిగిందని, తాను అసెంబ్లీలో కంటే జైలులోనే ఎక్కువ సమయం గడపాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. 2017లో రాహుల్ గాంధీని కలిసిన తర్వాత కాంగ్రెస్‌లో చేరానని, ఆయనే తన నాయకుడని నిర్ణయించుకున్నానని చెప్పారు. రాహుల్ గాంధీకి వ్యక్తిగత ఎజెండా లేదని, ఆయన దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తారని కొనియాడారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్‌దే ఏకపక్ష ఆధిపత్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ..
గెజిట్ విడుదల

మొదటిపేజీ తరువాయి.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరతూ బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, ఆ పిటిషన్లను స్పీకర్ తిరస్కరించడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ సెప్టెంబర్ 18న కీలక తీర్పు వెలువరించింది. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ తరఫున లోక్‌సభకు పోటీ చేసిన సమయం నుంచే ఆయనపై అనర్హత వేటు అమల్లోకి వస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ, అక్కడ కూడా ఆయన పిటిషన్ తిరస్కరణకు గురైంది. దీంతో ఆయన శాసనసభ్యత్వం రద్దు అధికారికంగా ఖరారైంది. ప్రస్తుతం ఆయన మాజీ ఎమ్మెల్యే అయ్యారు. మరోవైపు, త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తానే మళ్లీ విజయం సాధిస్తానని దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..?

మొదటిపేజీ తరువాయి.. అక్కడి నుంచి పరారయ్యారు. ఆరుగురు సభ్యులు అపార్ట్‌మెంట్‌లోని ఒక బ్లాక్‌లో సంచరిస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు, స్థానిక సెక్యూరిటీ గార్డులకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ల వాసులు భయాందోళన చెందుతున్నారు.

ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితం మాములుగా ఉండదు : దానం నాగేందర్

మొదటిపేజీ తరువాయి.. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్, నియోజకవర్గంలో జరగబోయే ఉపఎన్నికపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలో వచ్చే తీర్పు నిర్ణయాత్మకంగా ఉంటుందని ఆయన జోస్యం చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నెక్లెస్ రోడ్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దానం నాగేందర్, బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని బీజేపీ 'ఓట్ల దొంగతనం' చేస్తోందని, లోక్‌సభ ఎన్నికల్లో ఇదే జరిగిందని విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఖైరతాబాద్ సీటు ఫలితాన్ని ఏమాత్రం ప్రభావితం చేయలేదని ఆయన స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని దానం డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరపాలని కోరారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద దానం నాగేందర్‌పై అనర్హత వేటును సుప్రీంకోర్టు సమర్థించడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ ఉపఎన్నికలో పోటీకి తాను సిద్ధంగా ఉన్నట్లు ఆయన ఇప్పటికే ప్రకటించారు.

మనుషులకు ప్రాణాంతకం.. కీలక గడ్డిమందుపై కేంద్రం నిషేధం

నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన కలుపు సంహారకాల్లో (హెర్బిసైడ్) ఒకటైన పారాక్వాట్ డైక్లోరైడ్‌పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. మానవులు, మూగజీవాల ఆరోగ్యానికి ఇది తీవ్ర ముప్పుగా పరిణమిస్తోందని నిపుణుల కమిటీ నిర్ధారించడంతో ఈ కీలక నిర్ణయం వెలువడింది. ఈ మేరకు జారీ చేసిన నోటిఫికేషన్ తక్షణమే అమల్లోకి వస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో పారాక్వాట్‌ను నియంత్రించిన సుమారు 70 దేశాల జాబితాలో భారత్ కూడా చేరినట్లయింది. ఇన్సెక్టిసైడ్స్ యాక్ట్, 1968 నిబంధనల ప్రకారం, నిపుణుల కమిటీ, రిజిస్ట్రేషన్ కమిటీల సిఫార్సుల మేరకు ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజా ఆదేశాల ప్రకారం పారాక్వాట్ డైక్లోరైడ్‌కు సంబంధించిన కొత్త రిజిస్ట్రేషన్లను తక్షణమే నిలిపివేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను కూడా రద్దు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. సదరు సర్టిఫికెట్లను వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని, ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నిషేధాజ్ఞలను పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు దిశా నిర్దేశం చేసింది. పారాక్వాట్ డైక్లోరైడ్ అత్యంత విషపూరితమైన రసాయనం. దీనిని స్వల్ప మోతాదులో తీసుకున్నా ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంది. దీనికి నిర్దిష్టమైన విరుగుడు లేకపోవడం వైద్య రంగంలో పెను ఆందోళన కలిగించే అంశం. ఈ రసాయనం ప్రధానంగా ఊపిరితిత్తులు, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపి, 'పల్మనరీ ఫైబ్రోసిస్' వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తుంది. ఈ కలుపు సంహారకంపై నిషేధం విధించాలని శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు, పర్యావరణవేత్తలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం, దేశంలో 2024లో పురుగుల మందుల కారణంగా సుమారు 34,000 మంది మరణించారు. ఈ తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం, ప్రజారోగ్య ప్రయోజనాల దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

దేవుళ్లను కూడా విభజిస్తారా?
రేవంత్‌పై బండి సంజయ్ ఫైర్..

మొదటిపేజీ తరువాయి..
చిచ్చు పెట్టిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు దేవుళ్ల మధ్య కూడా విభేదాలు సృష్టిస్తూ కొత్త హోలాహలాన్ని తయారు చేస్తోంది" అని బండి సంజయ్ విమర్శించారు. దక్షిణ కాశీగా పేరు గాంచిన వేములవాడ, దక్షిణ అయోధ్యగా పిలవబడే భద్రాచలం ఉన్న తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డికి ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. "మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్ నగర్ లోనే హరిహర క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన మన్యంకొండ ఉంది. శివుడు, విష్ణువుల ఐక్యతకు ప్రతీక అయిన ఆ క్షేత్రం గురించి మీకు తెలియదా?" అని నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ కాశీ విశ్వనాథుడైన శివుడికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మొట్టమొదటి ప్రధాని కూడా ఆయనేనని బండి సంజయ్ గుర్తుచేశారు. "ఎన్నికల సమయంలో దేవుళ్లపై ప్రమాణాలు చేసి ఓట్లు అడిగిన మీరు, ఇప్పుడు అదే ప్రజలను విభజించడానికి దేవుళ్లకు కులం, ప్రాంతం అంటగడుతున్నారు. శివుడి హృదయంలో విష్ణువు, విష్ణువు హృదయం లో శివుడు ఉంటారనేదే సనాతన ధర్మం" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ విభజన రాజకీయాలను హిందువులు గమనించాలని, బీజేపీ నేతలు 'హర్ హర్ మహాదేవ్' అనరని చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ప్రధాని మోదీ స్వయంగా ఆ నినాదం చేస్తారని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్ ఘాతుకం..
క్యాబ్ ఎక్కిన మహిళపై లైంగిక దాడికి యత్నం

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్ శంషాబాద్‌లో తీవ్ర కలకలం రేగింది. 2019లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ ఘటన జరిగిన ప్రాంతం సమీపంలోనే మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ క్యాబ్ డ్రైవర్ తనపై లైంగిక దాడికి ప్రయత్నించాడని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన బాధితురాలు శంషాబాద్ వెళ్లేందుకు క్యాబ్ ఎక్కింది. అయితే, తొండుపల్లి టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే డ్రైవర్ కారును దారి మళ్లించాడు. సమీపంలోని కొత్వాల్‌గూడ వద్ద నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఆమెపై అఘాయిత్యానికి ప్రయత్నించాడు. అప్రమత్తమైన బాధితురాలు వెంటనే కారులోంచి బయటకు దూకి గట్టిగా కేకలు వేసింది. దీంతో భయపడిపోయిన డ్రైవర్, ఆమె వద్ద ఉన్న రూ. 60,000 నగదు గల బ్యాగును లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం బాధితురాలు శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

మొదటిపేజీ తరువాయి..
తెలంగాణలో స్థానికత (లోకల్ స్టేటస్) అర్హత సాధించడానికి నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. జిల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను పిటిషనర్ సవాల్ చేశారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోను సమర్థించింది. ఎంబీబీఎస్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు స్థానిక రిజర్వేషన్ పొందాలంటే, విద్యార్థి క్వాలిఫైయింగ్ పరీక్షకు ముందు కనీసం నాలుగేళ్ల పాటు తెలంగాణలోనే చదివి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, దానిని న్యాయస్థానం పునరుద్ఘాటించింది. ఈ తీర్పుతో తెలంగాణలో స్థానికతకు సంబంధించిన నిబంధనలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాసం అనే నిబంధన చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని, దీనిని కచ్చితంగా పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ఎల్ నినో ఎఫెక్ట్: తెలంగాణలో భగ్గుమంటున్న ఎండలు

మొదటిపేజీ తరువాయి..
తెలంగాణ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. ఎల్ నినో ప్రభావం కారణంగా పగటి ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల మేర ఎక్కువగా రికార్డవుతున్నాయి. ఫలితంగా రాష్ట్ర ప్రజలు అకాల వేడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో గరిష్ఠంగా 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇది సాధారణం కంటే 4 డిగ్రీలు అధికం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 34 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు కాగా, హైదరాబాద్‌లో సాధారణ ఉష్ణోగ్రత 31.8 డిగ్రీలకు బదులుగా ప్రస్తుతం 34 డిగ్రీలుగా నమోదవుతోంది. ఎల్ నినో ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

టీజీపీఎస్సీ కీలక ప్రకటన.. పలు ఉద్యోగ పరీక్షల షెడ్యూల్ విడుదల

మొదటిపేజీ తరువాయి.. షెడ్యూల్ ప్రకారం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) పరిధిలోని అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టులకు అక్టోబర్ 24న, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు అక్టోబర్ 26న పరీక్షలు నిర్వహించనున్నారు. అదేవిధంగా, ఆర్ అండ్ బీ శాఖలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టులకు నవంబర్ 6, 7 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. పాఠశాల విద్యాశాఖకు చెందిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి నవంబర్ 12, 13 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయని టీజీపీఎస్సీ వెల్లడించింది. ఈ షెడ్యూల్ విడుదలవడంతో అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

మంగళవారం 29 - 09 - 2026

నిత్యం నిఘా తెలుగు దినపత్రిక

ఓటమితో ఆగలేదు.. ప్రజల మధ్యే నా పోరాటం!

- చట్టసభకు దూరమైనా.. జనసభలో పోరాటం కొనసాగిస్తున్నా!
- నిరుద్యోగ సమస్యకు నిర్దిష్ట జాబ్ క్యాలెండర్ అవసరం : బీఆర్ఎస్‌రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి



వరంగల్, సెప్టెంబర్ 28
(నిత్యం నిఘా):
ఎన్నికల్లో గెలుపోటములు రాజకీయ ప్రయాణంలో సహజమేనని, అయితే ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడటమే తన లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయినా నిరాశ చెందలేదని, చట్టసభలో అడుగుపెట్టే అవకాశం రాకపోయినా జనసభలో ప్రజలతో కలిసి పనిచేసే అవకాశం లభించిందని తెలిపారు.

''గో హెడ్ రాకేష్'' అంటూ పార్టీ అధినేత కేసీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో గత రెండున్నరేళ్లుగా ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లోని 34 నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నానని చెప్పారు. విద్యార్థి నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రైవేట్ ఉద్యోగుల సమస్యలను తెలుసుకుంటూ వారి హక్కుల కోసం పోరాడుతున్నానని తెలిపారు. తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో తన రాజకీయ ప్రస్థానం, ప్రజా సమస్యలపై చేపట్టిన పోరాటం, సమకాలీన రాజకీయ అంశాలపై రాకేష్‌రెడ్డి మాట్లాడారు.

15 రోజుల ముందే ఎన్నికల బరిలోకి..

బీఆర్ఎస్‌లో చేరిన కొద్దిరోజులకే పార్టీ అధిష్ఠానం తనపై నమ్మకం ఉంచి ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా అవకాశం కల్పించిందని రాకేష్‌రెడ్డి తెలిపారు. ఎన్నికలకు కేవలం 15 రోజుల ముందు మాత్రమే తాను బరిలోకి దిగాల్సి వచ్చిందన్నారు. అయినప్పటికీ పార్టీ పెద్దలు, ఉమ్మడి జిల్లాల నాయకుల సహకారంతో ఎన్నికలను ఎదుర్కొన్నానని చెప్పారు.
విద్యార్థి నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు సహా అన్ని వర్గాల పట్టభద్రులు తనకు మద్దతుగా నిలిచారని తెలిపారు. కొద్దిపాటి ఓట్ల తేడాతో ఓడిపోయానని, ఓట్ల లెక్కింపులో అప్పటి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. అయితే ఆ ఓటమితో తాను నిరాశ చెందలేదన్నారు. ఒకరోజు కేసీఆర్ తనను పిలిచి మాట్లాడి పోరాడుతూ ముందుకు వెళ్లాలని సూచించారని తెలిపారు. చట్టసభలోకి వెళ్లలేకపోయాననే బాధ కంటే జనసభలో ప్రజలతో కలిసి పనిచేసే అవకాశం లభించిందనే భావనతో ముందుకు సాగుతున్నానన్నారు.

రెండున్నరేళ్లుగా సమస్యలపై పోరాటం



గత రెండున్నరేళ్లుగా విద్యార్థి నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నానని రాకేష్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమాలు నిర్వహిస్తున్నానన్నారు. జీఓ 46, జీఓ 29, గ్రూప్-1 నోటిఫికేషన్ వివాదాలు, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించామని చెప్పారు.
సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తున్నానన్నారు. నిరుద్యోగ బాకీ కార్డు ఉద్యమం, జలవిహార్‌లో సభ, యువసంగ్రామం వంటి కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తూ విద్యార్థి నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రైవేట్ ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నానన్నారు.

నిరుద్యోగ సమస్యకు జాబ్ క్యాలెండర్ అవసరం

నిరుద్యోగం తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందని రాకేష్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో నిర్దిష్టమైన జాబ్ క్యాలెండర్ విడుదల చేసే వ్యవస్థ రాష్ట్రంలో ఉండాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఎప్పుడు వస్తాయో తెలియక నిరుద్యోగులు ఏళ్ల తరబడి పట్టణాల్లో అద్దె గదుల్లో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నారని, దీనివల్ల ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. హనుమకొండ సెంట్రల్ లైబ్రరీకి వెళ్తే నిరుద్యోగుల పరిస్థితి అర్థమవుతుందని అన్నారు. నోటిఫికేషన్లు ఆలస్యమవడంతో చాలామంది వయోపరిమితిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం లేకపోవడం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్‌పై ఆందోళన వంటి కారణాలతో కొందరు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ ప్రాంతానికి చెందిన వేణు ఆత్మహత్య తనను తీవ్రంగా కలచివేసిందని, ఈ పరిస్థితులను మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు.


కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని రాకేష్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నెలనెలా వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందడం లేదని, కొన్ని సందర్భాల్లో వేతనాలు ఆలస్యమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల కుటుంబాల జీవన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలని అన్నారు.


'ఉద్యోగాలన్నీ బీఆర్ఎస్ హయాంలోనే ఇచ్చాం'

తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్ని విభాగాల్లో ఉద్యోగాల భర్తీ చేపట్టామని రాకేష్‌రెడ్డి తెలిపారు. పోలీసు, ఉపాధ్యాయ, ఇతర శాఖల్లో ఉద్యోగాలు భర్తీ చేశామని, సింగరేణిలో కారుణ్య నియామకాల సమస్యను పరిష్కరించామని అన్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విడుదలైన కొన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు ఎన్నికల కోడ్ తదితర కారణాలతో నిలిచిపోయాయని చెప్పారు. ప్రస్తుతం వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేస్తూ తమ ప్రభుత్వమే ఉద్యోగాలు ఇచ్చినట్లు చెబుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం మరోసారి తనకు అవకాశం ఇస్తుందన్న నమ్మకం ఉందని రాకేష్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి వారధిగా నిలుస్తానని అన్నారు.

బిట్స్ పిలానీలో డ్యుయెల్ డిగ్రీ.. ఆర్థిక అంశాలపై ఆసక్తి



తన స్వస్థలం గ్రేటర్ వరంగల్ పరిధిలోని హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామమని రాకేష్‌రెడ్డి తెలిపారు. తల్లిదండ్రులు ఏనుగుల కోమల, గోపాల్‌రెడ్డి అని చెప్పారు. పదో తరగతి వరకు వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో, ఇంటర్ గుంటూరులోని విజ్ఞాన్ కళాశాలలో చదివానన్నారు. ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో తొమ్మిదో ర్యాంకు సాధించడంతో బిట్స్ పిలానీలో ప్రవేశం లభించిందని తెలిపారు.



అక్కడ ఐదేళ్ల డ్యుయెల్ డిగ్రీ పూర్తి చేసి విద్యార్థి నాయకుడిగా పనిచేశానన్నారు. అనంతరం ఏడేళ్లపాటు బెంగళూరు, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశానని చెప్పారు. 2013లో బీజేపీలో చేరానని, అనంతరం పదేళ్లపాటు వరంగల్‌లో పార్టీ బలోపేతానికి పనిచేశానని తెలిపారు. మురికివాడల ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని, వరదల సమయంలో బాధితులకు తనవంతు సహాయం అందించానన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొన్ని అనివార్య కారణాల వల్ల బీఆర్ఎస్‌లో చేరానని వివరించారు.
ఆర్థిక, సామాజిక అంశాలపై ప్రత్యేక ఆసక్తి ఉన్న తనకు తెలంగాణ ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి అంశాలపై లోతైన అధ్యయనం చేసే అలవాటు ఉందని రాకేష్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ దినపత్రికలో ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు రాశానని, వాటిని సంకలనం చేసి 'ప్రగతి రథ చక్రాలు' పుస్తకాన్ని రచించానని చెప్పారు. అలాగే పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా 'తెలంగాణ ఎకానమీ' పుస్తకాన్ని తెలుగు, ఆంగ్ల భాషల్లో రచించానని తెలిపారు. 'నవ శకానికి నాంది' వంటి పుస్తకాలను కూడా రచించినట్లు రాకేష్‌రెడ్డి వివరించారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి

- **ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులపై సమగ్ర విచారణ జరపాలి: ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**





హనుమకొండ, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): కేంద్ర ఎన్నికల సంఘంలో జరిగినట్లు ఆరోపిస్తున్న అంతర్గత అవకతవకలు, SIR ఓటర్ల జాబితాలో ఏకపక్ష నిర్ణయాలు, అక్రమ ఓట్ల చేర్పులు, తొలగింపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలో మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఈసీ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకుల బృందం హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి ఓటర్ల జాబితాలో జరిగినట్లు వారు ఆరోపిస్తున్న మార్పులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులు జరిగాయని కాంగ్రెస్ పార్టీ గతంలోనే ప్రశ్నించిందన్నారు. SIR ప్రక్రియలో ఓట్ల చేర్పులు, తొలగింపులపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉండేలా పారదర్శక చర్యలు తీసుకోవాలని కోరారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు కాంగ్రెస్ అనుబంధ విభాగాల నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు, మండల, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, NSUI నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మోడల్ స్కూల్‌లో పోటీలు

- **విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసిన ఉపన్యాసం–చిత్రలేఖనం పోటీలు**



హనుమకొండ / ఎల్కతుర్తి, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా సోమవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమ కన్వీనర్ పల్లెపాటి మధుకర్ సమన్వయంతో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు నరేంద్ర మోదీ ప్రజా సేవా ప్రస్థానం, కేంద్ర ప్రభుత్వ పథకాలు, దేశ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ‘వికసిత్ భారత్–2047’ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు తమ ఆలోచనలు, కలలను ఉపన్యాసాలు, చిత్రాల రూపంలో ప్రదర్శించారు. ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధస్సు, అంతరిక్ష పరిశోధనలు, వ్యవసాయం, నైపుణ్యాభివృద్ధి, విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి తదితర అంశాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా విద్యార్థుల్లో దేశ భవిష్యత్‌పై అవగాహన పెంపొందించడం లక్ష్యమన్నారు. నేటి విద్యార్థులే రేపటి భారతదేశానికి నాయకత్వం వహించనున్నారని, వారి ఆలోచనలు, సృజనాత్మకత దేశాభివృద్ధిలో కీలకమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన రంగంలో నైపుణ్యాన్ని సాధించి దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

విజేతలకు ప్రశంసా పత్రాలు

ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ పెన్సిల్ స్కెచ్‌లను అందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, శాస్త్రీయ ఆలోచనా విధానం పెంపొందించడమే కార్యక్రమ ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు చీదురాల వెంకటేష్, అల్లి కుమార్, జనగాని కిష్టయ్య, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గడ్డం మధుకర్ రెడ్డి, వెళదండి రాజేందర్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు గూడెం నాగరాజు, సోషల్ మీడియా కన్వీనర్ పోలు శివసేన తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు నర్సింహులు, సుధాకర్, శ్రీధర్ రెడ్డితో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సర్వేపై వివాదం.. సమగ్ర విచారణకు డిమాండ్

ములుగు జిల్లా / మల్లంపల్లి, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రపురం శివారు–2లోని సెక్టార్–7లో లైసెన్స్‌డ్ సర్వేయర్లు నిర్వహించిన భూ సర్వేలో తమ భూములకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయకుండా పలువురికి నోటీసులు జారీ చేశారని భూయజమానులు తిప్పని రవీందర్, బొల్లపల్లి కుమారస్వామి ఆరోపించారు. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి, క్షేత్రస్థాయిలో మోకా సర్వే నిర్వహించి భూ హద్దులను నిర్ధారించాలని కోరారు.అధికారులకు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. రామచంద్రపురం శివారు–2లో తమ కుమారులు తిప్పని రవితేజ, గొల్లపల్లి విజయ్‌కుమార్ పేర్లపై మొత్తం 16 ఎకరాల 12 గుంటల భూమికి పట్టాలు ఉన్నాయని తెలిపారు. ఈ భూమికి రైతుబంధు కూడా పొందుతున్నామని, పట్టా పాస్‌బుక్కులు, లింక్ డాక్యుమెంట్లు తదితర హక్కు పత్రాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు.అయితే సెక్టార్–7లో లైసెన్స్‌డ్ సర్వేయర్లు రంజిత్, రవితేజ, బాలరాజు నిర్వహించిన సర్వేలో తమ భూములకు సంబంధించిన వివరాలను సక్రమంగా పరిగణనలోకి తీసుకోలేదని వారు ఆరోపించారు. తమ పేర్లను పరిగణనలోకి తీసుకోకుండానే పలువురికి నోటీసులు జారీ చేశారని, హక్కు పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించకుండా సర్వే చేయడంతో వివాదం ఏర్పడిందని తెలిపారు.బానోతు రామచంద్ర, గుగులోతు దస్మమ్మ, బదావత్ ఫూల్య, మాలోతు మోతిలాల్, భూక్య అనిత, మాలోతు మోహన్‌లాల్, గుగులోతు చంద్రకళ, బదావత్ కవిత, అంబి సరోజన, నేతవత్ భాస్కర్, హుస్సేన్, పలుకల లోహితారెడ్డిలకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొంటూ, వాటిని ఏ ఆధారాలతో జారీ చేశారో అధికారులు పరిశీలించాలని కోరారు.తమ వద్ద ఉన్న పట్టా పాస్‌బుక్కులు, లింక్ డాక్యుమెంట్లు, ఇతర హక్కు పత్రాలను



అధికారుల సమక్షంలో సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో మోకా సర్వే నిర్వహించి భూమి హద్దులను గుర్తించి, వాటిని రెవెన్యూ రికార్డులతో సరిపోల్చాలని విజ్ఞప్తి చేశారు. సర్వేపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని, అన్ని పక్షాల పత్రాలు, వాదనలు, రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకోవాలని తిప్పని రవీందర్, బొల్లపల్లి కుమారస్వామి అధికారులను కోరారు.

మల్లంపల్లిలో ఎరువుల దుకాణాలపై అధికారుల తనిఖీలు

- **అనుమతి లేని ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు: ఏఈఓ శ్రీధర్**



ములుగు జిల్లా/ మల్లంపల్లి, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): రైతులకు నాణ్యమైన ఎరువులు అందించడంతో పాటు అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు సోమవారం మల్లంపల్లి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలు, గోదాంలలో తనిఖీలు చేపట్టారు. ఏఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో శ్రీ నాగార్జున, సుధ, సృజన, వెంకటేశ్వర, అగ్రోస్ తదితర ఫర్టిలైజర్ షాపులను పరిశీలించారు.దుకాణాల్లోని ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లుబుక్కులు, విక్రయాల వివరాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఏఈఓ శ్రీధర్ మాట్లాడుతూ.. అనుమతి లేని ఎరువులు, నిబంధనలకు విరుద్ధమైన మిశ్రమాలను రైతులకు విక్రయించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి అనధికారిక ఎరువులు లేదా మిశ్రమాలు విక్రయించినట్లు తేలితే ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రైతులకు ఎరువులు విక్రయించే సమయంలో తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, స్టాక్ వివరాలను రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఎరువుల నిల్వలు, నాణ్యత, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన ఎరువులు అందించేలా వ్యాపారులు నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు.

హనుమకొండ బస్టాండ్‌లో విషాదం



హనుమకొండ, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ ప్రధాన బస్టాండ్‌లో సోమవారం ప్రమాదవశాత్తు ఓ మహిళ బస్సు ముందు టైరు కింద పడటంతో తీవ్రంగా గాయపడింది. రేగొండ మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన చుక్క నిర్మల హైదరాబాద్ వెళ్లేందుకు హనుమకొండ బస్టాండ్‌కు వచ్చినట్లు సమాచారం.హైదరాబాద్ వైపు వెళ్లే బస్సు ఎక్కిన ఆమెకు సీటు ఖాళీగా లేకపోవడంతో తిరిగి కిందకు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి బస్సు ముందు టైరు కింద పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే స్పందించిన తోటి ప్రయాణికులు 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది EMT మహేందర్, పైలట్ విజయ్ భాస్కర్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు, పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

పచ్చదనం ఉన్న ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం

- **మొక్కల పెంపకంతో ఆరోగ్యం, ఆర్థిక ప్రయోజనాలు: మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి**



హనుమకొండ, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): పచ్చదనం ఉన్న ప్రాంతాలు ఆహ్లాదకరంగా ఉండటంతో పాటు ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించేందుకు దోహదపడతాయని 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. సోమవారం వరంగల్ మహానగర పాలక సంస్థ హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో పండ్ల, పూల మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మరుపల్ల రవి మాట్లాడుతూ.. ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటడం ద్వారా పచ్చదనంతో పాటు ప్రశాంతమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. పండ్ల, పూల మొక్కల ద్వారా ఇంటి అవసరాలను తీర్చుకోవడంతో పాటు మిగిలిన ఉత్పత్తులను విక్రయించి ఆర్థికంగా ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. మొక్కలను విరివిగా పెంచడం వల్ల పర్యావరణ సమతుల్యతకు, వర్షపాతానికి, పాడి పంటల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.హార్టికల్చర్ అసిస్టెంట్ అనుహ మాట్లాడుతూ.. డివిజన్‌లోని ప్రజలకు ఆసక్తి ఉన్న పండ్ల, పూల మొక్కలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మొక్కలను తీసుకెళ్లిన ప్రతి ఒక్కరూ వాటిని సంరక్షించి, వాటి ద్వారా లభించే పండ్లు, పూలను తమ అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ అనుహ, నాయకులు మరుపల్ల గౌతం, ఆర్పీ హనుమకొండ హిమబిందు, ఉల్లి కవిత, గాడిపెల్లి పద్మ, కనుకుంట్ల స్వరూప, మరుపల్ల ఏలేంద్ర, ముత్తినేని రజిత, కుడికాల స్వరూపరాణి, మరుపల్ల దీపిక, అన్న దమయంతి, అన్న జయ, మరుపల్ల అనూష, కోరే సరోజన, గుడిమళ్ల ఉదయ, అంకం సరిత, గుడిమల్ల చంద్రకళ, నామని భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఏటూరునాగారంలో ఎరువుల దుకాణాలు, గోదాంల తనిఖీలు



ఏటూరునాగారం, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): మండల కేంద్రంతో పాటు ఆకులవారిఘనపురంలోని ఎరువుల దుకాణాలు, గోదాంలను సోమవారం అధికారులు తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో శ్రీ నారాయణ స్వామి, సాయితేజ, మన గ్రోమోర్, అగ్రోస్ తదితర ఎరువుల దుకాణాలను పరిశీలించారు.ఈ సందర్భంగా దుకాణాల్లోని ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లుబుక్కులను అధికారులు తనిఖీ చేశారు. అనుమతి లేని ఎరువులు, నిబంధనలకు విరుద్ధమైన మిశ్రమాలను రైతులకు విక్రయించరాదని డీలర్లను ఏఓ వేణుగోపాల్ హెచ్చరించారు.నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు లేదా మిశ్రమాలను విక్రయించినట్లు గుర్తిస్తే ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా డీలర్లు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ నిరసన

- **పోచమ్మ మైదాన్‌లో ధర్నా, రాస్తారోకో.. కలెక్టర్‌కు వినతిపత్రం**





హనుమకొండ, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పోచమ్మ మైదాన్ సెంటర్‌లో ధర్నా, రాస్తారోకో, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, మాజీ జీడబ్ల్యూఎంసీ మేయర్ గుండు సుధారాణి, శాసనమండలి సభ్యులు, మాజీ మంత్రి బస్వరాజు సారయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. అనంతరం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సుమారు గంటపాటు నిర్వహించిన రాస్తారోకోతో పోచమ్మ మైదాన్ సెంటర్‌లో నాలుగు వైపులా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అనంతరం వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ.. SIR ప్రక్రియ పేరుతో కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం ప్రజలు, ఓటర్లను అయోమయానికి గురిచేస్తున్నాయని కాంగ్రెస్ తరపున ఆరోపించారు. SIR ప్రక్రియలో లోపాలు ఉన్నాయని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం తీరును ప్రశ్నిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే నిరసనలు చేపడుతోందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు.తెలంగాణలో SIR తుది ఓటర్ల జాబితా ప్రచురణ గడువును ఎన్నికల సంఘం నవంబర్ 9కు పొడిగించింది. క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు అక్టోబర్ 7 వరకు అవకాశం కల్పించింది.

హౌసింగ్ బోర్డ్ కాలనీలో పారిశుధ్య సమస్యలు

- **మురుగు కాలువల్లో వ్యర్థాలు.. దుర్గంధంతో ఇబ్బందులు**
- **అధికారులు వెంటనే స్పందించి కాలువలు శుభ్రం చేయాలని స్థానికుల డిమాండ్**





హనుమకొండ, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ నగరంలోని 51వ డివిజన్ హౌసింగ్ బోర్డ్ కాలనీ పరిధిలో పారిశుధ్య సమస్యలు తీవ్రంగా నెలకొన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోర్ సూపర్ మార్కెట్ ప్రాంతం నుంచి వీసీపీ కార్యాలయం వరకు ఉన్న ప్రధాన మురుగు కాలువలు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి పూడుకుపోయాయని తెలిపారు.కాలువల్లో నీటి ప్రవాహం సక్రమంగా లేక మురుగునీరు నిలిచిపోవడంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు పేర్కొన్నారు. ఈ మార్గంలో బ్యాంకులు, వాణిజ్య సముదాయాలు ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. మురుగు కాలువల నుంచి వస్తున్న దుర్వాసన, ఈగల బెడదతో కాలనీవాసులు, వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మురుగునీరు నిల్వ ఉండటంతో పారిశుధ్య సమస్యలు ఏర్పడి, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి, కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

- **మంథని ఘాట్ల అభివృద్ధి, గౌతమేశ్వర ఆలయ పునర్నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి**
- **భూసేకరణ ప్రక్రియను సకాలంలో పూర్తిచేయాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా): గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని మంథని పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం మంథనిలో పర్యటించిన కలెక్టర్ పుష్కర ఘాట్ల అభివృద్ధి, గౌతమేశ్వర ఆలయ పునర్నిర్మాణం, పుష్కరాల కోసం చేపట్టాల్సిన భూసేకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులు, రైతులతో భూసేకరణపై సమీక్ష నిర్వహించారు. ఎండోమెంట్, ఇరిగేషన్ శాఖలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటూనే, పనులకు అవసరమైన భూమిని సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

ఘాట్ల పనులు వెంటనే ప్రారంభించాలి

పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, రహదారులు, పార్కింగ్, భద్రత వంటి మౌలిక వసతులను ముందుగానే ఏర్పాటు చేయాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

గౌతమేశ్వర ఆలయ పనులకు వేగం

మంథనిలోని గౌతమేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎండోమెంట్ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పుష్కరాల పనుల్లో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి పనికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు.

డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

మల్లెపల్లి బాలుర డిగ్రీ కళాశాలను స్థానిక బాలుర పాఠశాల ఆవరణలోకి మార్చిన నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. తరగతి గదులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, ఫర్నిచర్ తదితర సౌకర్యాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ పర్యటనలో ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ ఆరిఫోద్దీన్, ఎండోమెంట్, ఇరిగేషన్ శాఖల అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- **ఆక్రమణలకు తావులేకుండా హద్దులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



హనుమకొండ, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): జిల్లాలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా ముందస్తుగా హద్దులు ఏర్పాటు చేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.మంగళవారం కాజీపేట మండలం మడికొండ గ్రామంలో క్రైస్తవ, ముస్లిం శ్మశాన వాటికల నిర్మాణం కోసం ప్రతిపాదించిన ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత మ్యాప్‌లు, రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రభుత్వ భూములను త్వరితగతిన గుర్తించి, వాటి సరిహద్దులను ఖరారు చేయాలని కలెక్టర్ సూచించారు. హద్దు రాళ్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి, ప్రభుత్వ స్థలాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.ఈ పరిశీలనలో స్థానిక రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్వే విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ఓటు చోరీ’ ఆరోపణలపై కాంగ్రెస్ ర్యాలీ

- **సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్**





పరకాల, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలకు నిరసనగా ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 28న జిల్లా కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ల వద్ద నిరసనలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్ర ఎన్నికల సంఘం, ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పలు ఆరోపణలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు, ‘ఓటు చోరీ’ జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తూ, జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తిరస్కరించినట్లు వార్తా నివేదికలు పేర్కొంటున్నాయి.ఈ ర్యాలీలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒంటేరు శ్రవణ్ కుమార్, కౌన్సిలర్లు బండి శ్రీధర్, సుధమల్ల రమేష్, కొయ్యడ శ్రీనివాస్, బొచ్చు సాల్మన్, డీసీసీ కార్యదర్శులు పాడి కల్పనాదేవి, ఎండీ జాఫర్ రిజ్వి, ఎస్సీ సెల్ అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి, మహిళా నాయకురాలు లక్కం పసంత, కాంగ్రెస్ నాయకులు ఆయిలిపెల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్‌గా భేతి అశోక్‌బాబు

- **వైస్ చైర్మన్‌గా శానబోయిన రాజకుమార్.. ట్రెజరర్‌గా బొల్లం శివ**



వరంగల్, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా ఎన్నికల్లో చైర్మన్‌గా భేతి అశోక్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్మన్‌గా శానబోయిన రాజకుమార్, ట్రెజరర్‌గా బొల్లం శివ, స్టేట్ ఎంసీ మెంబర్‌గా నాడెం శాంతికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులుగా కుసుమ సత్యనారాయణ (రిటైర్డ్ తహసీల్దార్), తోట సంపత్ (రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు), మండల పరశురాములు (ఎన్‌జీవో), మామిడాల రమేష్‌బాబు (అడ్వకేట్), వద్ది రాజు (టీఎన్‌జీవో), చొప్పరి సోమయ్య (ఎన్‌జీవో), ముల్క ప్రసాద్, పుల్లూరి వేణు (న్యాయవాది), డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, మోతె తిరుపతిరెడ్డి, డాక్టర్ గజవెల్లి రాజకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, ఇతర పదవుల ప్రతినిధులకు పలువురు అభినందనలు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు, కలెక్టర్ డాక్టర్ సత్యశారదను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

తొలిముద్దతో అంగన్‌వాడీ చిన్నారులకు పోషక భరోసా

- బాల్యంలోనే పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యవంతమైన భవిష్యత్తు
- అంగన్‌వాడీల బలోపేతానికి సొంత భవనాలు, మౌలిక వసతుల కల్పన





ములుగు జిల్లా , సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): చిన్నారులకు బాల్యంలోనే సంపూర్ణ పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'తొలిముద్ద' కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో సోమవారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'తొలిముద్ద' అల్పాహార కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ బోర్డుడే హేమంత్ సహదేవరావుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారుల శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ వికాసానికి అవసరమైన పౌష్టికాహారం అందించడమే 'తొలిముద్ద' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారికి అందించే మొదటి ఆహారానికి 'తొలిముద్ద'గా నామకరణం చేసినట్లు చెప్పారు.ములుగు సహా ఎంపిక చేసిన ఆరు జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. అక్టోబర్ 1 నుంచి అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులకు గుడ్డుతో పాటు ఒకరోజు ఉప్మా, మరోరోజు కిచిడీ రూపంలో పౌష్టిక అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. చిన్నారుల శారీరక ఎదుగుదలకు అవసరమైన పోషక విలువలు ఉండేలా అల్పాహారాన్ని రూపొందించినట్లు వివరించారు.ములుగు జిల్లాలో ఇప్పటికే చిన్నారులకు రోజూ వండి మిల్లీలీటర్ల పాలు అందిస్తున్నామని, ఇకపై పాలు, గుడ్లు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం ద్వారా సంపూర్ణ పోషకాహారం అందుతుందని తెలిపారు. పోషకాహార లోపం ఉన్న చిన్నారులకు బాలామృతం, బాలామృతం ప్లస్ అందిస్తున్నామని పేర్కొన్నారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే చిన్నతనంలోనే పౌష్టికాహారం అందించి ఆరోగ్య సమస్యలను నివారించడం ఎంతో ముఖ్యమన్నారు.పౌష్టికాహారంతో పాటు ఆటపాటలు, పూర్వ ప్రాథమిక విద్య ద్వారా చిన్నారుల సంపూర్ణ వికాసానికి కృషి చేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య అందించాలని, నృత్యాలు, ఆటలు, పాటల ద్వారా వారిలో ఆసక్తిని పెంచాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు.ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కనీసం 20 మంది చిన్నారులు ఉండేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పాలు, గుడ్లు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఆట వస్తువులు, ఏకరూప దుస్తులు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే ముందు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పిల్లలకు బలమైన పునాది ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి ఉపాధి హామీ పథకం ద్వారా భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కేంద్రాలకు బీరువాలు, బల్లలు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా ఉన్నతీకరించామని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించామని మంత్రి చెప్పారు. ఖాళీలను గుర్తించి భర్తీ ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధి నిర్వహణలో మరణించినప్పుడు వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు కల్పించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ప్రతిపాదనలను మరోసారి సమర్పించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.పోషణ మాసంలో భాగంగా అధిక మాంసకృత్తులు కలిగిన ఆహారం తీసుకోవడం, హానికరమైన చిరుతిళ్లకు దూరంగా ఉండటంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా అంగన్‌వాడీ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని కోరారు.జిల్లా కలెక్టర్ బోర్డుడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ.. చిన్నారులకు పౌష్టిక అల్పాహారం అందించే 'తొలిముద్ద' కార్యక్రమానికి ములుగు జిల్లా ఎంపిక కావడం సంతోషకరమన్నారు. బాల్యంలోనే పౌష్టికాహారం అందించడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం మంత్రి సీతక్క, కలెక్టర్ హేమంత్ సహదేవరావు కలిసి అంగన్‌వాడీ టీచర్లకు 'తొలిముద్ద' అల్పాహార సామగ్రిని అందజేశారు. 'బేటీ బచావో–బేటీ పఢావో' కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. 'తొలిముద్ద' కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు మంత్రి, కలెక్టర్ స్వయంగా అల్పాహారం తినిపించారు.ఐడీఓసీ ఆవరణలో పోషణ మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను మంత్రి, కలెక్టర్ పరిశీలించారు. పౌష్టికాహార పదార్థాలు, తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్. మహేందర్‌జీ, సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్, ఆత్మ కమిటీ ప్రతినిధులు రఘు, రవీందర్‌రెడ్డి, అరుణ, ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు కృష్ణవేణి, జిల్లా రెవెన్యూ అధికారి రవికుమార్, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, సీడీపీఓ శిరీష, స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో ప్రతిభకు పదును

- హనుమకొండలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలు ప్రారంభం
- క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



హనుమకొండ, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేందుకు దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలకు కూడా సమయం కేటాయించాలని సూచించారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి తగిన వేదిక కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జిల్లా స్థాయి పోటీలు, ఎంపికల్లో భాగంగా వివిధ క్రీడాంశాల్లో సుమారు 2,000 మంది విద్యార్థి క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు భోజనంతో పాటు తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్‌ఖాన్, జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్‌గౌడ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ప్రశాంత్, హనుమకొండ ఎస్‌జఫ ేపీఫఐ ఆర్గనైజింగ్ సెక్రటరీ వాసుదేవరావు, అండర్–19 ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీధర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఏ. ప్రభాకర్‌రెడ్డి, మల్యాల దేవేందర్, పీఈటీఏ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కిషన్‌నాయక్, దశ్రునాయక్, శ్యాంప్రసాద్, టి. రాముడు, ఎస్. పార్థసారథి, మల్లారెడ్డి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి

- తూకంలో తేడాలు, బియ్యం పంపిణీలో అక్రమాలపై ఫిర్యాదులు
- ప్రతి షాపులో అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లతో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని ఐహెచ్‌ఆర్‌ఓ డిమాండ్

వరంగల్/ నర్సంపేట, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): నర్సంపేట డివిజన్ పరిధిలోని రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి, పేదలకు పూర్తి స్థాయిలో రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ (ఐహెచ్‌ఆర్‌ఓ) ప్రతినిధులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఐహెచ్‌ఆర్‌ఓ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాలకుర్తి విజయకుమార్, సంస్థ జిల్లా మహిళా అధ్యక్షురాలు గడ్డం సుభద్ర నర్సంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని కొన్ని రేషన్ దుకాణాల్లో బియ్యం తూకంలో తేడాలు చూపిస్తూ లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో బియ్యం పంపిణీ చేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, దీనిపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు.

ప్రతి రేషన్ షాపులో సమాచార బోర్డులు

రేషన్ దుకాణాల్లో అక్రమాలు జరిగినప్పుడు లబ్ధిదారులు వెంటనే అధికారులను సంప్రదించేలా ప్రతి షాపులో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని ఐహెచ్‌ఆర్‌ఓ ప్రతినిధులు కోరారు. పౌర సరఫరాల శాఖ అధికారులు, సంబంధిత తహసీల్దార్ల పేర్లు, ఫోన్ నంబర్లను బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటే సమస్యలను వెంటనే వారి దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని



పేర్కొన్నారు.

రేషన్ దుకాణాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, తూకంలో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న డీలర్లను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

భగత్ సింగ్ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

- హనుమకొండలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి
- అమరవీరుల త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు



హనుమకొండ, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): భారత స్వాతంత్ర్య సమరయోధుడు, అమరవీరుడు షహీద్ భగత్‌సింగ్ ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా సోమవారం హనుమకొండలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ త్యాగం ప్రతి యువకుడికి స్ఫూర్తినిస్తుందని అన్నారు. 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదంతో బ్రిటిష్ పాలకులను ఎదుర్కొన్న ధీరుడు భగత్‌సింగ్ అని పేర్కొన్నారు. ఆయన దేశభక్తి, ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల చరిత్రకు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నాయకత్వంలోనే అమరవీరులకు నిజమైన గౌరవం దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. భగత్‌సింగ్ కలలు కన్న అవినీతి రహిత, బలమైన భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం



వరంగల్/పర్వతగిరి, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ వరంగల్, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం వర్ధన్నపేట ఆధ్వర్యంలో పర్వతగిరి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, కస్తూర్బా పాఠశాలలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు విద్యార్థులతో కలిసి పాఠశాల పరిసరాలను శుభ్రపరిచారు.కార్యక్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ జనార్దన్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ కృష్ణ పాల్గొని విద్యార్థులతో కలిసి పరిసరాల్లోని చెత్తను తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా స్వచ్ఛ భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.విద్యార్థులు వారానికి కనీసం రెండు గంటలు, సంవత్సరానికి 100 గంటలను పరిశుభ్రత కార్యక్రమాలకు కేటాయించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించిన అనంతరం వారితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రతినిధి భాస్కరాచారి, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు శ్రీనివాస్, యాకూబ్ పాషా, మణికాంత్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, నాజియా సల్మా, ఉపాధ్యాయులు శ్రీరామ్, చందు, ఉపాధ్యాయినులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం

- **కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలి**
- **ప్రతి షాపులో అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లతో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని ఐహెచ్ఆర్ఓ డిమాండ్**



ములుగు జిల్లా, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): రాష్ట్రంలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యతో పాటు మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురుకులాలు, వసతి గృహాలు, కేజీబీవీలు, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని సూచించారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ బోర్డుడే హేమంత్ సహదేవరావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు మరింత పటిష్టం చేయాలని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, వినియోగం, నిర్దేశిత నిర్వహణ విధానాల అమలును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వసతి, ఇతర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అవసరమైన చోట్ల వంటశాలల ఆధునీకరణ పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని చెప్పారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, గుర్తించిన లోపాలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు.జిల్లాల్లో రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సంబంధించి ప్రతికూల నివేదికలు వచ్చినప్పుడు అధికారులు వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. తప్పుడు సమాచారం అని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, వాస్తవంగా సమస్య ఉన్నట్లు నిర్ధారణ అయితే తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, అవసరమైన దుప్పట్లను సమకూర్చాలని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో అవసరమైన మరమ్మతులు, మార్పులు చేపట్టేలా భవన యజమానులతో సమన్వయం చేయాలని కలెక్టర్లకు సూచించారు.ప్రతి ఉపాధ్యాయుడికి అవసరమైన శిక్షణ అందేలా చర్యలు తీసుకోవాలని, దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సంజయ్ జాజు ఆదేశించారు. యూనిఫాం వస్త్రం జిల్లాలకు చేరినందున కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

విద్యాసంస్థల్లో విస్తృత తనిఖీలకు కలెక్టర్ ఆదేశం

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని గురుకులాలు, వసతి గృహాలు, కేజీబీవీలు, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం, పరిశుభ్రమైన తాగునీరు, ఆరోగ్య సదుపాయాలు, భద్రత కల్పించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. వంటశాలల్లో పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ విధానం, వంటశాల నిర్వహణ, ఆహార పట్టిక అమలు వంటి అంశాలను తనిఖీల్లో పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. నాణ్యత లేని ఆహార పదార్థాలు లేదా సరుకులు సరఫరా చేస్తే వాటిని తిరస్కరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందేలా నీటి నమూనాలను, ఆహార పదార్థాలను అవసరమైన మేరకు పరీక్షించాలని సూచించారు.పాఠశాలలు, వసతి గృహాల పరిసరాల్లో పారిశుధ్యం, మరుగుదొడ్లు, డ్రైనేజీ, చెత్త తొలగింపు, క్రిమిసంహారక చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని పంచాయతీ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.బాలికల విద్యాసంస్థల్లో భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని, విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని అధికారులను ఆదేశించారు.విద్యా సంస్థల్లో బోధన, విద్యార్థుల హాజరు, వసతి సౌకర్యాలు, భోజనం, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత తదితర అంశాలను అధికారులు ఆకస్మిక తనిఖీల్లో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దడంతో పాటు అవే సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని తెలిపారు.తనిఖీల వివరాలు, గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సంబంధిత అధికారులు నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలతో పాటు విద్యాశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు ముఖ గుర్తింపు ఆధారిత హాజరు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు జనార్దన్, జిల్లా అధికారులు రామ్మోహన్, కొమురయ్య, జీసీఈఓ రజిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్‌కు రిసోర్స్, సోషల్ మ్యాప్‌లు

- **రెండు రోజుల్లో ప్రజల భాగస్వామ్యంతో మ్యాప్‌ల తయారీ పూర్తి చేయాలి**
- **గ్రామ అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు ఎంపిక చేయాలి:ఎంపీడీవో శంకర్ నాయక్**





వరంగల్/పర్వతగిరి, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్‌లో భాగంగా గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక రూపొందించేందుకు రిసోర్స్ మ్యాప్, సోషల్ మ్యాప్‌లను తయారు చేయాలని ఎంపీడీవో శంకర్ నాయక్ సూచించారు. రెండు రోజుల్లో అన్ని గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో ఈ మ్యాప్‌లను రూపొందించి, గ్రామాల్లోని వనరులు, అవసరాలను సమగ్రంగా గుర్తించాలని తెలిపారు.రిసోర్స్ మ్యాప్ ద్వారా గ్రామంలోని నీటి వనరులు, చెరువులు, కుంటలు, కాలువలు, వ్యవసాయ భూములు, ప్రభుత్వ స్థలాలు, రహదారులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర మౌలిక వసతులను గుర్తించి మ్యాప్‌లో పొందుపరచాలని సూచించారు. అలాగే సోషల్ మ్యాప్ ద్వారా గ్రామంలోని కుటుంబాల వివరాలు, నివాస ప్రాంతాలు, సామాజిక వర్గాలు, పేద కుటుంబాలు, మహిళా సంఘాలు, వృద్ధులు, దివ్యాంగులు తదితర సామాజిక అంశాలను గుర్తించి గ్రామ అవసరాలను అంచనా వేయాలని పేర్కొన్నారు.గ్రామాల్లో గుర్తించిన అవసరాల ఆధారంగా VB-G RAM-G పథకంలో ఎక్కువ సంఖ్యలో పనులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేయాలని ఎంపీడీవో శంకర్ నాయక్ తెలిపారు. గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సిబ్బంది, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు సమన్వయంతో రిసోర్స్ మ్యాప్, సోషల్ మ్యాప్‌లను పూర్తి చేసి, వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్ రూపకల్పనలో చురుకుగా పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంపీవో శేషు, ఏపీవో, ఈసీ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు

ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు

- **ప్రతి అర్జీ పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి**
- **వసతి గృహాల్లో మౌలిక వసతుల కోసం ప్రతిపాదనలు అందజేయాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



హనుమకొండ, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని పెండింగ్‌లో లేకుండా పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ రవి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రజావాణిలో అందిన అర్జీలపై వెంటనే చర్యలు చేపట్టి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను పరిష్కరించిన అనంతరం వాటి వివరాలను నమోదు చేయాలని సూచించారు.గురుకుల హాస్టళ్లు, ప్రభుత్వ వసతి గృహాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలను సంక్షేమ శాఖల ప్రత్యేక అధికారులు సత్వరమే అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.అదేవిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో నమోదుకు అర్హులైన పట్టభద్రులు, ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 136 అర్జీలు అందగా, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాల్లో 38, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణికి 135 అర్జీలు అందాయి. మొత్తం 309 అర్జీలు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

టేకులగూడెంలో ముమ్మరంగా రైతు నమోదు కార్యక్రమం





ములుగు జిల్లా/టేకులగూడెం, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం గ్రామంలో రైతు నమోదు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి పూనం ప్రసన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు, రాయితీలు, పంట రుణాలు తదితర ప్రయోజనాలు పొందేందుకు ప్రతి రైతు తప్పనిసరిగా రైతు గుర్తింపు కార్డు కలిగి ఉండాలని తెలిపారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ వివరాలతో రైతు నమోదు ప్రక్రియను సులభంగా పూర్తి చేసుకోవచ్చని సూచించారు.రైతు గుర్తింపు కార్డు ద్వారా ప్రధానమంత్రి కిసాన్, రైతు భరోసా, ఎరువుల కొనుగోలు, పంటలకు మద్దతు ధర వంటి ప్రభుత్వ సేవలు, ప్రయోజనాలను పొందేందుకు వీలుంటుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ నెల 30వ తేదీ వరకు గ్రామంలో ప్రత్యేక నమోదు కార్యక్రమం కొనసాగుతుందని ఏఈఓ ప్రసన్న వివరించారు. రైతులు తమ వివరాలను నమోదు చేసుకునేందుకు వెంటనే ఏఈఓను లేదా సమీప మీ సేవ కేంద్రాన్ని సంప్రదించి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు వాసం ఆనందరావు, గట్టుపల్లి లక్ష్మణరావు, కుర్షం సదానందం, వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

కుమ్మర్ల భూమిలో మరో సంఘ భవనానికి రహదారి యత్నం.. అడ్డుకున్న కులవృత్తిదారులు

- **54వ డివిజన్‌లో రెండు ఎకరాల స్థలంపై వివాదంతమ భూమిని సర్వే చేసి హక్కులు నిర్ధారించాలని కుమ్మర్ల సంఘం డిమాండ్**



హనుమకొండ / పోచమ్మకుంట , సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ 54వ డివిజన్‌లో కుమ్మర్ల కమ్యూనిటీ కి కేటాయించినట్లు చెబుతున్న రెండు ఎకరాల స్థలంలో మరో కమ్యూనిటీ సంఘ భవనానికి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టే ప్రయత్నం జరిగిందని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం హనుమకొండ జిల్లా ప్రతినిధులు ఆరోపించారు. తమకు కేటాయించిన స్థలంలో ఉన్న పెద్ద మధ్య నుంచి రహదారి వేయడాన్ని అడ్డుకున్నామని తెలిపారు.కుమ్మర సంఘం ప్రతినిధుల కథనం ప్రకారం.. తమకు సంబంధించిన రెండు ఎకరాల స్థలానికి సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి అందజేశామని తెలిపారు. స్థల సరిహద్దులను చూపించిన అనంతరం మిగిలిన పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అయితే తిరిగి తమ స్థలంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రయత్నం చేయడం తమకు ఆందోళన కలిగించిందన్నారు.రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకునే సమయంలో పోలీసులు, ఇతర అధికారులు అక్కడికి వచ్చి తమను బెదిరించినట్లు సంఘం ప్రతినిధులు ఆరోపించారు. కులాల మధ్య వివాదాలకు దారితీసే విధంగా వ్యవహరించకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. సర్వే నంబర్ 71లో తమకు సంబంధించిన స్థలాన్ని అధికారులు మరోసారి సర్వే చేసి, హద్దులను నిర్ధారించాలని కుమ్మర్ల సంఘం డిమాండ్ చేసారు . ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే నిబంధనల ప్రకారం సంబంధిత సంఘానికి కేటాయించాలని కోరారు . తమ స్థల హక్కులను స్పష్టంగా నిర్ధారించిన తర్వాతే ఇతర నిర్మాణాలకు సంబంధించిన పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేసారు .

సంగెం పీహెచ్‌సీని 100 పడకల ఆసుపత్రిగా మారుస్తాం





వరంగల్/సంగెం, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): సంగెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల నియోజకవర్గ మాజీ పోటీదారు డాక్టర్ పగడాల కాలిప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు దామెరుప్పుల చంద్రమౌళి ఆధ్వర్యంలో సోమవారం సంగెం పీహెచ్‌సీని సందర్శించిన ఆయన ఆసుపత్రిలోని వసతులు, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కాలిప్రసాద్‌రావు మాట్లాడుతూ సంగెం పీహెచ్‌సీలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది కొరత ఉందని, అత్యవసర మందులు, ఇన్సులిన్ వంటి మందులు అందుబాటులో లేక పేదలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆరోపించారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, తమ పార్టీ విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ప్రజలు తమ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. తనకు అవకాశం కల్పిస్తే సంగెం మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

రోడ్లు, మౌలిక వసతులపై విమర్శలు

సంగెం మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక దోమల వ్యాప్తితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డాక్టర్ కాలిప్రసాద్‌రావు ఆరోపించారు. కొన్ని గ్రామాల్లో సురక్షితమైన తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో పక్షపాతం ఆరోపణ

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అర్హులకు అన్యాయం జరుగుతోందని, అధికార పార్టీకి చెందిన అనుచరులకే ప్రాధాన్యం ఇస్తున్నారని డాక్టర్ కాలిప్రసాద్‌రావు ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు కేటాయించడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో ఎల్గూర్ రంగంపేట సర్పంచ్ బెజ్జంకి శేషాద్రి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు రహ్మతుల్లా, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బుట్టి కుమారస్వామి, గీసుగొండ మండల అధ్యక్షుడు కొంగర రవి, మండల ప్రధాన కార్యదర్శి శ్యామ్, దాసరి కుమారస్వామి, బోగా కోటేశ్వర్, సారమ్మనాలం చంద్రశేఖర్, కర్ణాకర్, రంగరాజు కృష్ణ, దోమల రవి యాదవ్, దామెరుప్పుల వీరేష్, అల్లం కుమారస్వామి, రమణ, రమణచారి, పండుగ రాజు, కుమారస్వామి, బెజ్జంకి రాజు, న్యాల రమేష్ యాదవ్, రాంబాబు, మెంతుల రాజేందర్, ఓదెల శంకర్, హింగే మురళి తదితరులు పాల్గొన్నారు.

ఒకే కార్యదర్శి.. రెండు పంచాయతీలు.. జీతాల్లో తేడా ఎందుకు?

- **పెద్దముసిలేరులో చెల్లింపులు పూర్తి.. చిన్నముసిలేరులో సిబ్బందికి ఎదురుచూపులు**
- **కార్యదర్శి తీరుపై సిబ్బంది, సర్పంచ్ అసంతృప్తి.. సమన్వయ లోపంపై ఆరోపణలు**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/చర్ల ,సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని చిన్నముసిలేరు గ్రామ పంచాయతీలో సిబ్బంది జీతాల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. చిన్నముసిలేరు, పెద్దముసిలేరు గ్రామ పంచాయతీలకు ఒకే పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తుండగా.. పెద్దముసిలేరు పంచాయతీ సిబ్బందికి జీతాలు చెల్లించినట్లు తెలుస్తుండగా, చిన్నముసిలేరు పంచాయతీ సిబ్బందికి మాత్రం ఇప్పటివరకు జీతాలు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు జమ అవుతాయని, సాధారణంగా ఐదో తేదీలోపు సిబ్బందికి చెల్లింపులు జరుగుతాయని సిబ్బంది చెబుతున్నారు. అయితే సెప్టెంబర్ 28వ తేదీ వచ్చినప్పటికీ తమకు జీతాలు అందకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీతాల చెల్లింపుపై పంచాయతీ కార్యదర్శిని పలుమార్లు ప్రశ్నించినప్పటికీ, చెల్లింపులు చేస్తామని చెబుతున్నా ఇప్పటివరకు నగదు అందలేదని సిబ్బంది పేర్కొంటున్నారు. నెలాఖరు సమీపిస్తున్నా జీతాలు రాకపోవడంతో తమ ఆర్థిక ఇబ్బందులను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. పంచాయతీ పరిపాలనలో సర్పంచ్, కార్యదర్శి మధ్య సమన్వయం కొరవడిందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కార్యదర్శి తీరుపై సర్పంచ్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో గ్రామంలో అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రభావం పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఒకే కార్యదర్శి పరిధిలో ఉన్న రెండు పంచాయతీల్లో ఒకచోట సిబ్బందికి జీతాలు చెల్లించి, మరోచోట ఎందుకు జాప్యం జరుగుతోందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చిన్నముసిలేరు పంచాయతీ సిబ్బందికి జీతాల చెల్లింపులో జాప్యానికి అసలు కారణం ఏమిటి? చెల్లింపులు ఎప్పుడు జరుగుతాయి? రెండు పంచాయతీల్లో చెల్లింపుల విషయంలో తేడా ఎందుకు వచ్చింది? అనే అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.పంచాయతీ పరిపాలనలో సమన్వయం నెలకొల్పడంతో పాటు చిన్నముసిలేరు పంచాయతీ సిబ్బంది జీతాల సమస్యను వెంటనే పరిష్కరించాలని సిబ్బంది, గ్రామస్థులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

అలరించిన ప్రజా కళారూపాలు, ప్రదర్శనలు





నిత్యం నిఘా, ఖమ్మం, సెప్టెంబర్ 28 : అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభల సందర్భం గా యస్ఆర్ అండ్ బిజీయన్ఆర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభలో ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళ నాడు, ఒరిస్సా నుండి వచ్చిన ప్రజా కళాకారులు బహిరంగ సభకు ముందు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈప్రదర్శనలను అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నిర్వాహణలో జరిగాయి.రైతు కూలీల ఊరేగింపు బహిరంగ సభ ప్రాంగణం లో ప్రవేశించగానే వేదిక పైన తాము కళా కౌశలాన్ని ప్రదర్శించారు. తొలుత జంగారెడ్డి గూడెం ఏజెన్సీ ప్రాంతం నుండి వచ్చిన కొమ్ము కళాకారులు డప్పులు వాంచుతూ లయ బద్దంగా నృత్యం చేశారు.ఓగ్గు కాదు మల్లక్క అదిలాబాద్ టీం ప్రదర్శించింది,"అన్నదాత రైతన్నా అన్ననృత్యం రైతుపడే బాధలను, దోపిడీ ని వివరించే విధంగా మహిళా బృందం అద్భుతంగా ప్రదర్శన ఇచ్చారు. భద్రాచలం ప్రాంతం నుండి వచ్చిన గిరిజన కళాకారులు బాణాలు ధరించి చేసిన ఆదివాసీ ప్రదర్శన విశేషం గా ఆకట్టుకుంది. గంగిరెద్దు వేషధారణతో ఓకళాబృంధం ప్రదర్శించిన ప్రదర్శన ఆకట్టుకుంది, ఖమ్మం ప్రాంతంకు చెందిన కోలాటం దళం ప్రదర్శన,మహబూబాబాద్ కు చెందిన మహిళా డప్పుదళం పిరమిడ్ ప్రదర్శన ఆకట్టుకుంది.బేకులపల్లికి చెందిన మహిళలు బంజారా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం శ్రీకాకుళం గిరిజన పోరాటం దృశ్యరూపంగా సిక్కోలు యుద్ధం జముకుల కథ ను ఆంధ్రప్రదేశ్ ఉత్తరాంధ్ర కళాకారులు ప్రదర్శించారు. హైదరాబాద్ కళాకారులు అమరుడు నాగన్న స్మృతిలో ఆధునిక మౌన నృత్యరూపకం కవితాత్మకంగా ప్రదర్శించారు."మనిషి మరణించవచ్చు కానీ పాటకు మరణం లేదు"అంటూ నాగన్న అమరత్వం పైన అద్భుతమైన దృశ్యరూపం ప్రదర్శించారు. సభలో తమిళనాడు కోలాం జిల్లా నుండి వచ్చిన కళాకారులు తమిళ భాషలో పాడిన ఎర్రజెండా పాటలు ఆకట్టుకున్నాయి. ఓరిస్సాతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజా కళాకారులు వేదిక పై పాటలు పాడారు.తొలిసారి ఖమ్మం లో వివిధ జిల్లాల, రాష్ట్రంల కళాకారుల కళాబృందాలు కనువిందు చేయడమే కాక ఖమ్మం ప్రజలను ఆకట్టుకున్నాయి.అరుణోదయ తెలంగాణా కళాకారులు ప్రదర్శనలకు నాయకత్వం వహించారు. పి.వేణు,ఉదయగిరి, శ్రీశైలం, వద్దెన్న, బి.,లక్ష్మన్న,జ్యోతి, మంగ, ఉమేష్, దదితరులుఈ ప్రదర్శనలకు నాయకత్వం వహించారు. బహిరంగసభకు వచ్చిన వేలాది మంది ప్రజలు ప్రజా కళారూపాలను ఆస్వాదించారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కలెక్టరేట్ ముట్టడికి ఎమ్మార్పీఎస్ పిలుపు.. విద్యార్థులను హైదరాబాద్‌కు తరలిరావాలని ఆహ్వానం

ములుగు జిల్లా /వాజేడు, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): మద్యపాన నిషేధం అమలు చేయొద్దనే డిమాండ్‌తో అక్టోబర్ 2న ములుగు జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీ ఎస్, ఎంఎస్పీ ములుగు జిల్లా ఇన్‌చార్జి చాతాళ్ల రమేష్ మాదిగ తెలిపారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ మహిళా సమైక్య, మహాజన మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

వాజేడు మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు చెన్నం స్వామి మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఎంఎస్పీ సీనియర్ నాయకుడు గుగ్గిళ్ల నరేందర్ మాదిగ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చాతాళ్ల రమేష్ మాదిగ మాట్లాడుతూ మద్యపాన నిషేధం అమలు చేయొద్దనే డిమాండ్‌పై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. స్పందించని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎంఎస్ఎఫ్ జాతీయ మహాసభకు తరలిరావాలి

అక్టోబర్ 6న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని రమేష్ మాదిగ పిలుపునిచ్చారు. వాజేడు మండలం నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి మహాసభలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు కొనసాగించడంతో పాటు వర్గీకరణ ద్వారా లభించే అవకాశాలను మాదిగ విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా



విద్యపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధికి విద్య కీలక ఆధారమని పేర్కొన్నారు. చదువుకుంటూనే హక్కుల కోసం పోరాటం కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సీనియర్ నాయకులు పడిదల సతీష్ మాదిగ, బలుసుపాటి స్వామి మాదిగ, కీసరి రాజు మాదిగ, చిట్యాల రాకేష్ మాదిగ, ఎస్.కె. రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సాధికారతకు నైపుణ్య శిక్షణ ఎంతో ఉపయోగకరం



మహబూబాబాద్ / తొర్రూరు, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): మహిళల సాధికారతతో పాటు కుటుంబ అభివృద్ధికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఎంతో ఉపయోగకరమని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు తక్కలపల్లి రవీంద్ర, పెదవంగర ఎంఈఓ బుధారపు శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు, సామాజికవేత్త, ఉత్తమ సాహిత్యవేత్త అవార్డు గ్రహీత ఇమ్మడి రాంబాబు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆర్. యాకయ్య అన్నారు.ఆదివారం తొర్రూరులోని నితిన్ ఫౌండేషన్‌లో ఎన్ఎస్సీ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రం నిర్వాహకులు లావణ్య, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో శిక్షణ పొందిన సుమారు 500 మంది మహిళలకు ముఖ్య అతిథులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు వివిధ రంగాల్లో శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించడం ద్వారా వారి నైపుణ్యాలకు గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. మహిళలు తమకు వచ్చిన నైపుణ్యాలను వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు కుటుంబ పోషణలో తమవంతు పాత్ర పోషించాలని సూచించారు.కుటుంబాన్ని తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, వారి కృషికి తగిన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. పేదరికం నుంచి ఎన్నో మహిళలు వివిధ రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకున్నారని గుర్తుచేశారు. పట్టుదల, నైపుణ్యంతో లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలతో పాటు రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో ఘనంగా భగత్‌సింగ్ జయంతి వేడుకలు

- **చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జనసేన నాయకులు**
- **భగత్‌సింగ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి: పల్లపు మధు**

మడికొండ, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): భారత స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు భగత్‌సింగ్ జయంతి వేడుకలను సోమవారం మడికొండలో వర్ధన్న పేట నియోజకవర్గ జనసేన నాయకులు పల్లపు మధు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పల్లపు మధు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ చేసిన త్యాగాలు, యువతలో ఆయన నింపిన దేశభక్తి స్ఫూర్తి చిరస్మరణీయమన్నారు. భగత్‌సింగ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జానపట్ల రాము, దాసరి వీరేష్, లక్ష్మణ్, రాకేష్, వరికుప్పల శేఖర్, పసునూరి ప్రశాంత్, వస్కుల శ్రీకాంత్, గూటం కిషోర్, జిట్ట రాజ్‌కుమార్, పల్లపు హర్షిత్‌తో పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎం ఆసుపత్రి భద్రతపై ఎస్పీఎఫ్ అధికారుల సమీక్ష

- **ప్రస్తుతం ఉన్న భద్రతా ఏర్పాట్ల పరిశీలన.. భవిష్యత్ చర్యలపై అధికారులతో చర్చ**
- **పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేతను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీఎఫ్ అధికారులు**

వరంగల్, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో భద్రతా ఏర్పాట్లపై ఎస్పీఎఫ్ పోలీసు ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో ప్రస్తుతం అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించడంతో పాటు, భద్రతను మరింత పటిష్టం చేసేందుకు భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించారు.ఆసుపత్రి ప్రాంగణంలో భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలు, ప్రస్తుతం ఉన్న భద్రతా సిబ్బంది, ఏర్పాట్లు తదితర అంశాలను ఎస్పీఎఫ్ అధికారులు పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది, రోగులు, వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతను మెరుగుపరిచే అంశాలపై చర్చించారు.అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్‌ను ఎస్పీఎఫ్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసుపత్రి భద్రతకు సంబంధించిన అంశాలపై ఆమెతో చర్చించినట్లు తెలిపారు.పోలీస్ కమిషనర్‌ను కలిసిన వారిలో ఎస్పీఎఫ్ కమాండెంట్ కోటేశ్వర రావు, ఇన్‌స్పెక్టర్ భీమా తదితరులు ఉన్నారు.



ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

- **ప్రతి దరఖాస్తును సత్వరమే పరిష్కరించాలిప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్**
- **ఉద్యోగులందరూ ముఖచిత్ర హాజరులో నమోదు కావాలి: కలెక్టర్ స్నేహ శబరీష్**



మహబూబాబాద్, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ ముఖచిత్ర హాజరు విధానంలో నమోదు చేసుకోవాలని సూచించారు.సోమవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్‌కుమార్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఇన్‌చార్జి పురుషోత్తం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీపై వెంటనే చర్యలు ప్రారంభించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.గురుకుల హాస్టళ్లు, ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలను సంక్షేమ శాఖల ప్రత్యేక అధికారులు సత్వరమే అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో నమోదుకు అర్హులైన పట్టభద్రులు, ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 93 అర్జీలు అందగా, ఆర్డీవో కార్యాలయాల్లో 3, ఎంపీడీవో కార్యాలయాల్లో 123 అర్జీలు వచ్చాయి.ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగలక్ష్మి , డీఆర్డీవో ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదనరాజు, డీవీహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి దేశీరామ్ నాయక్, డీఎంహెచ్‌వో డాక్టర్ రవిరాథోడ్, సీపీవో శ్రీనివాసరావు, డీహెచ్ఎస్‌వో జీ. మరియన్న, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

భూపాలపల్లి, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు.జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 15 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్న ఎస్పీ.. సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసర మైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన పోలీస్ సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.



సంగెం ఎస్సై వంశీకృష్ణ జన్మదిన వేడుకలు

వరంగల్/సంగెం, సెప్టెంబర్ 28 (నిత్యం నిఘా ప్రతినిధి): సంగెం మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై వంశీకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ భవనంలో మండల అధ్యక్షుడు వేల్పుల అనిల్ యాదవ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేశారు.అనంతరం ఎస్సై వంశీకృష్ణకు ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు మచ్చిక వెంకటేశ్వర్లు, గాయపు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మచ్చిక వీరస్వామి, జర్నలిస్టులు సిద్ధ నాగరాజు, హరి, నాగరాజు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

